

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంచిక : 4 సంపుటి : 5 పుష్పం : 7

## జిన్నూరులో శ్రీనాన్నగారి ప్రవచనము, 8-11-98

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సాధన లేకుండా సిద్ధికలుగదు. ధనం వలన గాని, విద్యవలనగాని, గౌరవాల వలన గాని, బంధువుల వలనగాని మనోనిగ్రహం రాదు. మనస్సుకు నిగ్రహం రావాలంటే అభ్యాసం, వైరాగ్యం ఉండాలి. ఎంతోకొంత వైరాగ్యం ఉంటే మీరు చేసిన జపం, మీరు చేసిన ధ్యానం ఫలిస్తాయి. మనకు శారీరకంగా అనుబంధం ఉన్న వారందరూ బంధువులు. మనక్షేమాన్ని ఎవరైతే కోరుతున్నారో వారు ఆత్మబంధువులు. సమాజంలో మార్పు వస్తూ ఉంటుంది, కుటుంబంలో మార్పు వస్తూ ఉంటుంది, వాతావరణంలో మార్పు వస్తూ ఉంటుంది, ఇలామార్పులు జరుగుతూనే ఉంటాయి. ఇన్ని మార్పులమధ్య మార్పులేని వస్తువు, చావులేని వస్తువు ఒకటి నీహృదయంలో ఉంది. దైనందిన జీవితంలో నీపని నీవు చేసుకొంటూ ప్రశాంతముగా ఉండి నీలోపల ఉన్న వస్తువును తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. ఎన్నో మార్పుల మధ్య మార్పులేకుండా సదా ఉండే వస్తువును పట్టుకొంటే నీవు తరిస్తావు. ఈభూమి మీదకు వచ్చిన పని పూర్తి అవుతుంది. నీదేహయాత్రకోసం ఎంతవరకు పనిచేయాలో చూసుకో. ఈబంధువులతోటి ఈ వస్తువులతోటి ఉన్న సంబందం నిజంకాదు. స్వప్నంతో సమానము. నీహృదయంలో ఉన్న వస్తువును తెలుసుకోవాలంటే నీమనస్సును చల్లగా ఉంచుకోవాలి. భగవంతుడు ఎలా జీవించమని చెప్పాడో అలా జీవించటం నేర్చుకోవాలి.

మనదేహం చనిపోయిన తరువాత మనం ఒక్కరిమే ప్రయాణం చేయాలికాని మనకూడా ఎవరూరారు. నీదేహప్రారబ్దాన్ని బట్టి చదువు, డబ్బు, అధికారం ఉండవచ్చు. ఇవినిజంకాదు. నీమనస్సును స్వాధీనం చేసుకోవటానికి అభ్యాసం, వైరాగ్యం అలవాటు చేసుకోవటం తప్పదు. వైరాగ్యం వలన నీ మనస్సును బాగా నియమించుకోవచ్చును. హృదయంలో ఉన్న సత్యవస్తువును అనుభవైకవేద్యం చేసుకోవటానికి నీకు సహృదయం ఉండాలి, మంచిగుణాలు ఉండాలి, సద్బుద్ది ఉండాలి. అవిలేవనుకో ఆవస్తువు నీహృదయంలో ఉన్నా అది నీ సొంతం అవ్వదు, నీచేతికి అందదు. నీ ప్రారబ్దాన్ని బట్టి పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా నువ్వు ఉద్రేకపడకుండా నీ మనస్సును సమానంగా ఉంచుకొని నీహృదయంలో ఏ వస్తువు అయితే ఉందో దానిని నిరంతరము స్మరిస్తూ, ధ్యానిస్తూ దానిని తెలుసుకోవటం కోసం జీవించు, అది ఉందో లేదో అని సందేహం పెట్టుకోవద్దు. అది ఉంది కాబట్టి చెపుతున్నారు. నమ్మితే సొమ్ము నమ్మకపోతే దుమ్ము. కష్టసుఖాలు వచ్చినప్పుడు మీరు సమానంగా

ఉంటున్నారో, లేదో చూడటానికి భగవంతుడు పరీక్ష పెడతాడు. చిల్లర విషయాలకు, చిల్లర చింతలకు నీ మనస్సు చిందిపోకుండా నీలోపల ఉన్న వస్తువును గట్టిగా పట్టుకోవాలి. కొంత అభ్యాసం చేస్తే, వస్తువుకు సంబంధించిన రుచి కొంతచూస్తే అది ఉందో లేదో నీకు తెలుస్తుంది. మనకు ఎంతోకొంత భక్తి ఉందిగాని మనభక్తి ఇంకా సహజం అవ్వలేదు. మనభక్తి కనుక సహజం అయితే లోపల ఉన్న సహజవస్తువు మనకి దొరుకుతుంది. గురువు పాదాలను ఆశ్రయించి నీవు అభ్యాసం చేస్తూ ఉంటే నీభక్తి సహజమవుతుంది.

నీకు ఉపయోగంలేని భావాలు వస్తూ ఉంటాయి. ఆభావాలే నిన్ను బంధిస్తున్నాయి అన్నసంగతి నీకు తెలియటం లేదు. ఇతరులు నిన్ను బంధిస్తూ ఉంటే నీవు పారిపోవచ్చు కాని నీ భావాలే నిన్ను బంధిస్తూ ఉంటే ఎక్కడికి పోతావు. మనస్సులో ఉదయించే భావాలను సంకల్పాలను ఎవడైతే వేరుతో సహా బయటకు లాగుతున్నాడో వాడి మనస్సు వస్తువుల మీదకు, వ్యక్తుల మీదకు పరుగుపెట్టదు, అది ఆత్మాభిముఖంగా ప్రయాణం చేసి అమృతత్వంలో ఐక్యమవుతుంది. ఆత్మాభిముఖంగా ప్రయాణం చేయటానికి నీమనస్సు రెడీ అయితే నువ్వు స్థితప్రజ్ఞుడివి అవుతావు. సుఖానికి, శాంతికి, ఆనందానికి బాహ్యమైన వస్తువుల మీద ఆధారపడకుండా నీహృదయం మీద ఆధారపడి ఉంటే నీబుద్ధి స్థిరంగా ఉంటుంది. నిశ్చలంగా ఉంటుంది. ఆరోజుకారోజు నీబుద్ధి అణిగిపోయి ఆత్మాకారం చెందుతుంది. నీదగ్గర వెయ్యికోట్లు డబ్బు ఉన్నా శరీరం చనిపోయన తరువాత ఒక్కరూపాయి కూడా నీకూడా రాదు. మీ బుద్ధికి కుదురులేకపోతే ఆకుదురులేని బుద్ధి శరీరం చనిపోయిన తరువాత నీకూడా వస్తుంది.

భగవంతుడు చెప్పినమాటలు మనం వింటే సరేసరి. వినం అనుకోండి. ఆయన మాటలు వినే పరిస్థితులు భగవంతుడే కల్పింపజేసి మొట్టికాయలు మొట్టి వినిపింపజేస్తాడు వాడే దేవుడు. మనం పిల్లలను బడికి వెళ్ళమంటాము. వాడు సరిగా వెళితే సరేసరి. నేను వెళ్ళను అంటే ఏదైనా కొనుక్కోరాబాబు అని డబ్బులు ఇస్తాము. అప్పడుకూడా వెళ్ళను అంటాడు అనుకోండి వాడిని పట్టుకొని బాది స్కూలుకు పంపుతాము. భగవంతుడు కూడా ఇదే చేస్తాడు. నీవు సహజంగా నేర్చుకోలేకపోతే నీకు ఎలా నేర్పాలో నాకు తెలుసును అని భగవంతుడు చెపుతున్నాడు. నీవు కొంతధ్యానం చేస్తే, కొంత విచారణ చేస్తే, కొంతసత్పురుషులతో సహవాసం చేస్తే ఇది సత్యం ఇది అసత్యం, ఇది బంధం ఇది మోక్షం, ఇది శాంతి ఇది అశాంతి అని మీకళ్ళకు స్పష్టంగా రెండింటికి బేధం తెలుస్తుంది. ఏవిషయాలు అయితే నిన్ను భాదపెడుతున్నాయో ఆవిషయాలనుండి నీవు బయటకు రావాలంటే ఒక అవతారపురుషుడిని గాని, గురువునుగాని ప్రీతితో, ఇష్టంతో ధ్యానం చేస్తే నిన్ను భాద పెట్టే విషయాలు వాటి అంతటఅవే రాలిపోతాయి. మీఇంటిలో దుమ్ము ఉంది అనుకోండి. సగం దుమ్ము తీసివేసి సగం దుమ్ము ఉంచుకొంటే శుభ్రతరాదు. దమ్మును పూర్తిగా తొలగించాలి. అలాగే నీమనస్సులో ఉన్న సంకల్పాలను వేరుతో సహా తొలగించినప్పడు మాత్రమే నీవు స్థితప్రజ్ఞుడవు అవుతావు.

ఏపద్ధతిలో నీవు సాదనచేస్తే నీ మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుందో, హృదయంలో

మనుగుతుందో ఆపద్ధతిలో నీ జీవితాన్ని తీర్చిదిద్దుకో, అనుకరణ వద్దు. ప్రీతిగా, ఇష్టంగా ఆత్మలో ఉండగలిగితే బాహ్యవిషయాలు నిన్ను అక్కడనుండి కదపలేవు. ఎవరో గౌరవిస్తారు అని, ఇన్నిగంటలు అక్కడ ఉంటే సరిపోతుంది అని ఇలా యాంత్రికంగా చేయకూడదు. భగవంతుడు చెప్పిన మాటలకు అనుగుణంగా జీవించటం నేర్చుకొంటే ఆయన అనుగ్రహానికి పాత్రులవుతారు. చేతిలో ఉన్న వస్తువును నోట్లో వేసుకోవటం ఎంత తేలికో భగవంతుని అనుగ్రహానికి పాత్రులయిన వారు మోక్షం పొందటం అంత తేలిక. అనుగ్రహాన్ని సంపాదించటం కష్టంగాని అనుగ్రహం కలిగితే ఆత్మజ్ఞానం అత్యంత సులభంగా వస్తుంది. మీతలంపులనుండి, సంకల్పముల నుండి మీరు వేరుపడితే అప్పుడు మీ మనస్సు ఆత్మలో ఉంటుంది గాని లేకపోతే ఉండదు. ఏవిషయాలు అయితే మిమ్మల్ని ఇబ్బందిపెడుతున్నాయో, ఏభావాలు అయితే మిమ్మల్ని చిరాకు పెడుతున్నాయో వాటినుండి వేరుపడితే మీమనస్సు హృదయంలో స్థిరంగా ఉంటుంది. మీరు ఎప్పుడూ అరుణాచలంలోనే ఉంటారు కాశీ వెళ్ళిరాకూడదా, బదరీ వెళ్ళిరాకూడదా, రామేశ్వరం వెళ్ళి రాకూడదా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. అసలు కాశీవెళ్ళాలి, రామేశ్వరం వెళ్ళాలి, బదరీ వెళ్ళాలి అనే తలంపు వస్తే కదా వెళ్ళటం అని భగవాన్ అన్నారు. మీరు మంచినీళ్ళు ఎప్పుడు త్రాగుతారు. మంచినీరు కావాలి అనే తలంపు వచ్చాక త్రాగుతారు. తలంపులేనప్పుడు మంచినీళ్ళు గొడవలేదు. అలాగే కాశీవెళ్ళాలి, రామేశ్వరం వెళ్ళాలి అనే తలంపువస్తే కదా వెళ్ళటం తలంపులేనప్పుడు కాశీ ఏమిటి? రామేశ్వరం ఏమిటి? అన్నీ తలంపులే. అలా అని మిమ్మల్ని వెళ్ళవద్దు అని కాదు. ఆయన ఏస్థాయిలో ఉన్నాడో సూచించటం కోసం చెపుతున్నారు. ఆస్థాయిని అందుకోవటానికి, అంత ఎత్తు ఎదగటానికి ఆయన సహాయసహకారములు అందుతూనే ఉంటాయి.

మనం అందరము ఆనందములోనే ఉన్నాము. అయితే ఎందుకు తెలియటం లేదు అంటే మనకు ధ్యానము లేదు, జపంలేదు, విచారణ లేదు, వివేకము లేదు. అందువలన మనహృదయంలోనే ఆనందం ఉన్నా అది మనకు తెలియటం లేదు. గురువు నీకు ప్రత్యేకంగా ఆనందాన్ని తెచ్చి ఇవ్వడు నీహృదయంలో ఉన్న ఆనందాన్ని నీకు తెలిసేలా చేస్తాడు. నీది నీకే ఇస్తాడు. నీహృదయంలో ఉన్న ఆనందం నీమనస్సుకు తెలిస్తే బాహ్యంగా వెళ్ళే ఉరకలు ఆగిపోతాయి. అప్పడు నీమనస్సు కుదురుపడుతుంది. నీబుద్ధి మోహకలిలంలో నుండి వేరుపడుతుంది. నీమనస్సు బాగుపడాలంటే నీవు లోపలకు వెళ్ళు. నీమనస్సు బయటకు వెళితే బాడి చేసుకొంటుంది. ఆబాడి కడుక్కోవటానికి 50 జన్మలు పట్టవచ్చు, 100 జన్మలు పట్టవచ్చు. నీమనస్సు బయటకు వెళ్ళకుండా లోపలకు వెళితే అది శుద్ధి అవుతుంది, తనంతట తానుగా రాలిపోతుంది. నీవు సత్యాన్వేషణను విడిచిపెట్టవద్దు. నీశరీరం మరణించకముందే నీహృదయంలో ఉన్న సత్యాన్ని పొందలేకపోతే ఈజననమరణ చక్రంలో నుండి బయటకు రాలేవు. ధ్యానం చేసేటప్పుడు కళ్ళు మూసుకో మంటారా, కళ్ళుతెరుచుకోమంటారా అని అడుగుతున్నారు. కళ్ళు మూసుకొన్నావా, కళ్ళు తెరుచుకొన్నావా అనేది ముఖ్యం కాదు. నీమనస్సు లోపలకు వెళుతోందా లేదా, దానికి చల్లదనం వస్తోందా లేదా అనేది ముఖ్యం. మీ

ఇంటిలోనివారు మిమ్మల్ని గౌరవించటం లేదు అని కంగారు పడకండి. వారు గౌరవిస్తే మీకు వారి మీద మోహం కలుగుతుంది. వారు గౌరవించకపోతే వారితో బంధం కలుగదు. అది మన సాధనకు ఉపయోగపడుతుంది. అహంకారం నెత్తిమీద వేసుకొని తిరిగేవారు మిమ్మల్ని గౌరవించినా, గౌరవించకపోయినా దానిని బట్టి మీకు మోక్షం రాదు. దేవుని అనుగ్రహం ఉంటే మోక్షం వస్తుంది. ఇవి అన్నీ ప్రకృతి గొడవలు రోడ్డు మీద ఎంత జనం వెళ్ళినా మనం పట్టించుకోము అలాగే నీమనస్సులో ఎన్ని గొడవలు ఉన్నా వాటిని పట్టించుకోవద్దు అప్పడు వాటి అంతట అవే రాలిపోతాయి.

ధ్యానం చేసేటప్పడు అవసరంలేని తలంపులు ముసురుతూ నీమీదకు వస్తాయి. నీధ్యానం యొక్క లోతులు పెరుగుతూ ఉంటే ధ్యానశక్తి ఏవాసన నిన్ను బాధిస్తోందో దానిని పట్టిలాగి, గుంజి దానిని నశింపజేస్తుంది. నీకు శాంతి కావాలంటే బజారులో దొరకదు, స్నేహితుల దగ్గర, బంధువుల దగ్గర శాంతి దొరకదు. నీవు ధ్యానం చేయటం వలన, విచారణ చేయటంవలన, ఒక మహాగురువుని నిరంతరము స్మరించటంవలన, అరుణగిరిని ధ్యానించటంవలన, భగవంతుడికి శరణాగతి చెందటం వలన నీకు శాంతి కలుగుతుంది. మన మనస్సు ఎంత నిశ్చలంగా నిర్మలంగా ఉంది అని భగవంతుడు చూస్తాడుగాని మన మనస్సు నిశ్చలంగా ఉన్నట్లు నటిస్తే భగవంతుడు మోసపోడు, మనకి మోక్షాన్ని ఇవ్వడు ఆత్మలోనే సుఖం ఉంది, శాంతి ఉంది, ఆనందం ఉంది. లోకంవైపుకు ప్రయాణం చేస్తున్న మనస్సుకు అది అందదు. ఆత్మవైపుకు ప్రయాణం చేస్తున్న మనస్సుకు అది అందుతుంది. ఆత్మయందు ఆత్మవైపుకు ప్రయాణం చేసే మనస్సుతో ఆత్మాలో ఉన్నశాంతిని, ఆనందమును జుర్రుకో, అప్పడు నీవు స్థితప్రజ్ఞుడివి అవుతావు. ఆత్మవైపుకు మళ్ళించిన మనస్సుతో వెళ్ళి ఆత్మాలో ఉండి అక్కడ తిష్టవేసుకొంటే అప్పడు నీకు కావలసిన సుఖం, శాంతి, ఆనందం ప్రవాహంలాగ వచ్చి నీమీద పడుతుంది. ఆప్రవాహంలో కొట్టుకొనిపోతావు. ఆత్మలో ఉన్న సంతృప్తి నీకు దొరికితే బయటవిషయాలను నీ మనస్సుకోరదు. భగవంతుడు ఇంత స్పష్టంగా చెపుతూ ఉంటే ఇంకా చెప్పండి చెప్పండి అంటే ఇంక చెప్పేదిఏముంది.

1. 20-12-98 నుండి 29-12-98 వరకు అరుణాచలం క్యాంప్.
2. 31-12-98 సఖినేటిపల్లిలో శ్రీనాన్నగారి ప్రవచనము.
3. 03-01-99 జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము - 119వ రమణ జయంతి మహోత్సవము

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL